“కూ పోదకం వటాద్చాయా తాంబూలం తరుణీ కుచం శీతా కాలే భవేద్యుష్టం. ఉష్ణకాలే న శీతలం.....”

“తాంబూల సేవనంవలన శీతాకాలంలో వేడిగానూ, వేసవిలో చల్లగాను వుంటుందట”

“హాఫ్ క్రిమినల్వి”

“అదేం?”

“అతి ముఖ్యమయిన ఓ పదానికి అర్థాన్ని దాచేశావు కాబట్టి”

“గ్రహించావుగా అది చాలు....”

“అవునూ” హరిత వెల్లకిలా పడుకుంది “కర్పూరం వేసిన తాంబూలాన్ని ప్రియదూతకు తెచ్చి ఇస్తేనే కాని కవిత్వం రాయటం కష్టమని అల్లసాని అన్నాడే.... మరి హటాత్తుగా నీ నోటికి కవిత్వం ఎలా వచ్చింది?”.

“మొన్న నువ్విచ్చిన తాంబూలం రుచి నేనింకా మరిచిపోలేదు కాబట్టి...” ఓ క్షణం ఆగి “చాలు.... లేచి చీర కట్టుకో.”

“ఏం నీ పల్స్‌రేట్ అప్పుడె నూరు దాటేసిందా?”

“అదేం?”

“ఇష్టమయిన అమ్మాయిని చూసినా, తలుచుకున్నా మగాడిలో ముందొచ్చే ఫిజియాలజికల్ చేంజ్‌లో అదీ ఒకటని సైంటిఫిక్ ఎక్స్‌పరిమెంట్స్ నిరూపించాయి కాబట్టి.”

“నీకు సైన్సు కూడా తెలుసు.”

“దానితో సెన్స్ కూడా వుంది...” ఫకాలున నవ్వింది హరిత. “అవునూ.... నిన్న రాత్రిబాగా టెన్షన్‌తో మొహం మాడ్చుకుని కూచున్న వాడివి, వేకువనే ఇంత ఉత్సాహంతో మాట్లాడుతున్నావేంటి?” అంది.

“నానీ ఆచూకీ తెల్సింది”

“వ్వాట్....”

“నిజం హరితా.... నానీ బ్రతికే వున్నాడు.... అంతవరకు నిజం.”

హరిత ఆలస్యం చేయలేదు.

మరో పదిహేను నిమిషాలలో యశస్వి అపార్టుమెంటుని చేరుకుంది.... “నానీ గురించి ఎలా తెలిసింది?”

ఆ రోజు దినపత్రిక ముందుంచాడు.

“అగ్రకులంపై దళితుల తిరుగుబాటు” అన్న వార్తకి పైగా అప్పారావు చేతుల్లో నానీని చూసింది.

“ఈ బాబు......” తొట్రుపాటుగా గొణిగింది. “ఆ రోజు ట్రైన్‌లో....

“వ్వాట్....” యశస్వి భృకుటి ముడిపడింది.

“గాడ్.... నిజం యశస్వి.... ఆరోజు నేను ఫ్రెండ్ పెళ్ళికి విజయవాడ వెళ్ళేటప్పుడు

భయంతో నేనున్న కూపేలోకి వచ్చాడు....

తర్వాత....బ్రతికించే మందు కోసం ఏడో స్టేషన్‌లో దిగాలన్నాడు"

"ఏడో స్టేషన్‌లోనా....?"

"అవును..... స్టేషన్ పేరు చెప్పకుండా ఏడో స్టేషన్‌లో దిగాలంటే నేనూ ఆశ్చర్యపోయాను....." చెప్పుకుపోతూనే వుంది.

యశస్వి మెదడు పదునుగా పనిచేయడం మొదలుపెట్టింది. "సో.... నానీ అలా వెళ్ళాడు అంటే అర్థం బలవంతంగా పంపించబడ్డాడు. ఐ మీన్ ఒక ప్రమాదం నుంచి తప్పించే ప్రయత్నంలో అప్పటికప్పుడు తోచిన పద్ధతిలో పంపించేశారు. యస్.... ఐ గాటిట్...."

"ఏంటీ!?" విస్మయంగా అడిగింది హరిత.

"నీకు తెలిసిన దాన్ని బట్టి నానీపై అమ్మ తర్వాత అంతటి ప్రభావంగల వ్యక్తి తాతయ్య విశ్వేశ్వరశాస్త్రి -కాబట్టే మంచం పట్టిన తాతయ్య బహుశా నానీపై జరగబోయే హత్యా ప్రయత్నాన్ని ముందే గుర్తించి అలా మభ్యపెట్టి పంపించి వుంటాడు. ఆ తర్వాత యాదృచ్ఛికంగా కాక ఎవరో తరుముతున్నప్పుడు హోం మినిష్టరు కారు ముందు పడిపోతే దాన్ని తన అవకాశానికి వినియోగించుకుని వుంటాడు అప్పారావు...." చెప్పుకుపోయాడు.

ఓ క్షణం బాధగా తల పంకిస్తూ "డేమిట్.... నానీ అంతదూరం వెళతాడని వూహించలేకపోయాను. లేకపోతే చంద్రం నానీ కనిపించలేదని స్టేషన్‌లో ఇచ్చిన ఫోటోని ఈ పాటికి పత్రికలో పబ్లిష్ చేయించి వుండేవాణ్ణి. ఈ సరికే నానీ మనకు దక్కుండేవాడు...." అన్నాడు గొణుగుతున్నట్టుగా.

"ఇప్పుడు మాత్రం ప్రాబ్లమేంటి....." ఆదుర్దాగా అడిగింది.

"నీకు తెలీదు హరితా! ఈ ఒక్క వార్త పబ్లిష్ కావడంతో నానీ ఓ అతిముఖ్యమయిన సంఘటనలో కీలకమైన పాత్రగా మారిపోయాడు. జాగ్రత్తగా నానీని ఆ వూబినుంచి బయటకి లాగకపోతే వాడి ప్రాణాలకే ప్రమాదం".

"అదెలా?"

"నానీ ఇప్పుడు నిజం చెబితే అది హోం మినిష్టర్ పరువు బజార్న పడటానికి ఓ కారణమౌతుంది. నా అంచనా తప్పుకాకపోతే హోం మినిష్టర్ కి నానీ ఎవరో ఈ పాటికే తెలుసుంటుంది. కాబట్టి తన వాళ్ళని రక్షించుకునే ప్రయత్నంలో ఇప్పుడు నానీ ప్రాణాలు తీయించే ఏర్పాట్లు చేసి వుంటాడు."

"వాట్.... తన వాళ్ళంటే?"

"పావని మరణానికి సంబంధించిన అసలు నిజం బయటకు రాకూడదనుకునే వాళ్ళు ఆ విషయాన్ని లోతుగా పరిశోధించాలనుకుంటున్న నన్ను ఆ అప్పారావు పలుకుబడితో ట్రాన్స్‌ఫర్ చేయించాలనుకుంటున్న వాళ్ళు"

హరిత స్థాణువులా వుండిపోయింది.

“అమ్మలా అన్నం పెట్టిన ఆంటీ.... నీకు నా దణ్ణం.”

ఆ రోజు ట్రైన్‌లో నానీ రాసిన ఆ ఒక్క వాక్యమూ గుర్తుకొచ్చిన హరిత కళ్ళల్లో అసంకల్పితంగా ఓ నీటిబొట్టు నిలిచింది.

“ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?”

“నిజాన్ని లోతుగా తవ్వింది నేను హరితా.... ఆ గొయ్యి నానీకి సమాధి కాకూడదు- అప్పుడు నేను మిగలడమూ నిజం కానఖ్కరలేదు” యధాలాపంగా అన్నాడు “కమాన్”

** ** ** **

“మీరు దాచి ప్రయోజనం లేదు. నానీ మీకే కాదు ఇపుడు నాకూ ఆప్తుడే. నానీ ప్రాణాలు మీకే కాదు, నాకూ ముఖ్యమే. ప్లీజ్-చెప్పండి!” యశస్వి అర్థిస్తుంటే చాలా సేపటిదాకా నిశ్శబ్దంగా వుండిపోయిన విశ్వేశ్వరశాస్త్రి నెమ్మదిగా తలతిప్పి చూశాడు.

అప్పటికి అరగంటగా సందిగ్ధంలో మిగిలిపోయిన ఆ వృద్ధుడి కళ్ళల్లో అస్పష్టంగా నీళ్ళు నిలిచాయి.

ఆ నీళ్ళ పొరల మాటున ఇంకా ప్రపంచంలో వధింపబడుతున్న ఓ సత్యాన్ని రక్షించాలని ప్రయత్నించే యుగపురుషులున్నారా అని సంశయం.

“తాతగారూ.... ఆయనడుగుతున్నది ఓ పోలీసాఫీసరుగా కాదు ఓ పసికందు తన మూలంగా ఆపదల్లో చిక్కుకుపోయాడే అని బాధపడుతున్న మనిషిగా, మీరు నిర్వర్తించాలనుకున్న ఒక ధర్మాన్ని తన భుజాల పైకి తీసుకోవాలనుకుంటున్న వ్యక్తిని మీరు నిరుత్సాహపరచడం న్యాయమా చెప్పండి-?” అంది హరిత.

మంచానికి అతుక్కుపోయిన దేహం నుంచి బలాన్ని కూడగట్టుకుంటూ ఓ చేతిని పైకి లేపాడు విశ్వేశ్వరశాస్త్రి

“సత్యమేవ జయతే-” అన్నాడు భారంగా యశస్వి తలపై చేతులు ఆనించి.

ఆ తర్వాత ఒక్కో విషయాన్ని వివరించాడు.

“నానీ బ్రతికితే నిజం తెలిసిపోతుంది. అందుకే నానీనే అబద్ధంగా మార్చాలని నా కన్న కూతురు రాజారావుని పురిగొలిపింది. అది తెలుసుకున్న మరుక్షణమే నానీని యిక్కడ నుంచి పంపాలని నన్ను బ్రతికించే మందు తీసుకురమ్మని రాజారావు కంట పడకుండా ఏడు స్టేషన్‌ల దూరం ప్రయాణంచేసి అక్కడ ఒక వ్యక్తిని కలుసుకొమ్మన్నాను. హరివిల్లులో ఏడు రంగులుంటాయని తెలీని ఆ పసికందుని ఒకే రంగుల సత్యం ఏడు సముద్రాల అవతల మాత్రమే వుంటుందీ, అది తెలుసుకు రమ్మని బిడ్డని పంపిన నిస్సహాయుడయిన తండ్రిలా మభ్య పెట్టి దూరం పంపాను. ఆ క్షణంలో అంతకు మించి నాకేం తోచలేదు. వాడెక్కడున్నాడో అని అనుక్షణం కంగారు పడుతున్న నాకు మీరు చెప్పిన నిజంతో ఊరటగా వుంది. మీ అండ వాడికి లభ్యమైనందుకు ఆనందంగానూ వుంది.”

యశస్వి శెలవు తీసుకుని బయటకి వచ్చాడు.

అంతవరకూ బయట నిలబడ్డ కాంతమ్మ, సరళ, చంద్రాల్ని ఇక 'లోపలికి వెళ్ళొచ్చు' అన్నాడు సాలోచనగా చూసి.

నానీ విషయం ప్రస్తావించడానికి మనసు రాలేదు.

అసలు ఆ ఇంట విశ్వేశ్వరశాస్త్రి తప్ప నానీ యోగక్షేమాలు కోరుకునే ఒక్క వ్యక్తయినా ఉంటేగా-

"నేనూ వస్తాను" అంది హరిత స్థిరంగా అంది.

"గుడ్" నవ్వాడు, "పెళ్ళికి ముందే సత్యభామలా నరకాసుర యుద్ధానికి నాకు తోడొస్తానంటే నాకు అభ్యంతరం లేదు. కాని గనికొండ ఎనిమిది గంటల ప్రయాణం. తట్టుకోగలవా-?".

"అక్కడ పక్క విలేజ్ మార్టూరులో నా స్నేహితురాలు ఉంది".

"నిజం" నానీ బ్రతికే వున్నాడన్న ఆనందం అతడిని ఉత్తేజపరుస్తోంది

"మనకి తప్పకుండా అవసరమైన సహాయం చేస్తుంది."

"నీలా తెలివున్న అమ్మాయేనా?"

"ఉన్నింటి అమ్మాయి కూడా. పేరు రతి"

సరిగ్గా ఇదే సమయంలో....

బస్టాండులో ఓ మూల పార్శిల్సు వెనక నిద్రపోతున్న నానీ కళ్లు తెరిచాడు.

రాత్రి హరి వెంటాడుతుంటే తప్పించుకోవడానికని స్టాండ్‌లో గుట్టలుగా పడివున్న పార్శిల్సు వెనక దాక్కుని అలాగే సొమ్మసిల్లి పడుకున్నాడు.

పాంటుజేబు చూసుకున్నాడు. రాందేవ్ ఇచ్చిన ఆ 'నిజం' భద్రంగా వుంది.

పార్శిల్సు వారగా నడుస్తుంటే కాళ్ళు తూలిపోతున్నాయి.

ఒకపక్క నిలబడి చుట్టూ చూశాడు. హరికాని రాజారావుగాని కనిపిస్తారేమోనని.

బస్టాండ్ అంతా సందడిగా వుంది జనంతో. కాని వాళ్ల జాడ లేదు.

ఇక భయం లేదనిపించి నెమ్మదిగా బయటకు రాబోతుండగా ఎవరో ఒక వ్యక్తి వేగంగా వచ్చి పార్శిల్సు మూలన నక్కాడు.

వెనువెంటనే 'దొంగ దొంగ' అన్న అరుపుల్తో అటుగా జనం పరుగెత్తుకొచ్చి అటూ యిటూ దిక్కులు చూస్తూ ఆగిపోయారు.

"ఇటే పోయాడు"

"ఇక్కడే వుంటాడు, వెతకండి."

జనంలో నుంచి కేకలు వినిపిస్తున్నాయి.

"ఏమయింది?" ఎవరో అడుగుతున్నారు.

"మా ఆవిడ మెడలో లాకెట్ తెంపుకుపోయాడు" మరెవరో జవాబిస్తున్నారు.

అప్పుడు చూశాడు నానీ మూల నక్కిన వ్యక్తి పిడికిలిలోని బంగారపు లాకెట్‌ని.

అర్థమైపోయింది అతడే దొంగని.

తను కనిపించకుండా జాగ్రత్త పడుతూ నక్కుతూ బయటకొచ్చాడు.

జనం దొంగజాడ గుర్తించక అటూ ఇటూ దిక్కులు చూస్తుంటే తనకు తెలిసిన 'నిజం' చెప్పాలని వారగా నిలబడ్డ ఓ వ్యక్తిని చేరిన నానీ చేతితో తట్టాడు.

"దొంగ"

మకిలిపట్టిన మొహంతో నిలబడ్డ నానీనే పరికించి చూస్తూ "ఎక్కడ" అన్నాడు ఆ వ్యక్తి రహస్యంగా చెవిలో.

"అదిగో అక్కడ వాటి వెనుక."

"నిజం!"

"ఒట్టు!"

అతడు తనను అభినందించాలని నానీ కోరుకోలేదు.

ఆ క్షణాన అంతటి నిస్త్రాణలోనూ ఒక నిజాన్ని చెప్పాలన్న తపన మాత్రమే!

ఆ వ్యక్తి నానీని పైకెత్తుకున్నాడు.

ఎందుకో ముందు అర్థంకాలేదు.

ఆ ప్రదేశం నుంచి దూరంగా తీసుకుపోతుంటే "అటెక్కడికి అంకుల్? దొంగ వున్నది అక్కడన్నమాట" చేతిని పైకెత్తి చూపించబోయాడు.

నానీ చెంప పగిలిపోయింది.

అక్కడ వున్న వ్యక్తులు అప్పుడు చూశారు....

నానీ నీరసంగా మూలుగుతూ మరేదో అనబోతుంటే మరో దెబ్బ-

"వెధవ సన్నాసీ.... అమ్మేదో అందని అలిగి ఇంటిపట్టున వుండకుండా వూరిమీద పడతావా" ఎడాపెడా చెంపలు వాయిస్తూ దూరంగా తీసుకుపోతున్నాడు.

జోక్యం చేసుకోబోయిన కొందరు వ్యక్తులు ఆగిపోయారు.

నానీ....

నిన్నటి ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి అవకాశవాదాన్ని ఇంకా జీర్ణించుకోలేదు.

ఇప్పుడు మరో చేదు అనుభవం.